https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 89 బుధవారం 5-08-2026 పేజీలు : 4



రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.


## ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్

# డిసెంబరులో..

### గ్లోబల్ సమిట్‌లో ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**డిసెంబరు 9, 10 తేదీల్లో సమిట్ నిర్వహణ**

**స్కిల్స్ వర్సిటీ సమీపంలో పెట్టుబడుల సమిట్ వేదిక**

**30 వేల ఎకరాల్లో అన్ని హంగులతో ఫ్యూచర్ సిటీ**

**అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక**

**సిద్ధం చేస్తున్న సింగపూర్ మాస్టర్ ప్లాన్ నిర్మాతలు**

**ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించడమే లక్ష్యం**

**శరవేగంగా సాగుతున్న ఎక్స్‌ప్రెస్ వే పనులు**

**ఇక కంపెనీలతో సంప్రదింపులు ఫ్యూచర్ సిటీలోనే**



**హైదరాబాద్, ఆగస్టు 4:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సంబంధించి తుది మాస్టర్ ప్లాన్ దాదాపు పూర్తయింది. డిసెంబరులో నిర్వహించనున్న 'గ్లోబల్ సమిట్'లో ఈ మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేయనున్నారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక ప్రకారం ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. మాస్టర్ ప్లాన్ రూపొందించే పనిని సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్కు సంస్థకు అప్పగించారు. 1950ల్లో సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ను, 1971లో సింగపూర్ కాన్సెప్ట్ ప్లాన్‌ను రూపొందించారు. దాన్ని ఐదేళ్లకోసారి సమీక్షిస్తారు. అందులో భాగస్వాములుగా ఉన్న వ్యక్తులు ఇప్పుడు భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వాములు అయ్యారు. ఫార్చ్యూన్-500 కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే తెలంగాణనే మొదటి చాయిస్ అయ్యేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి అపార అవకాశాలు ఉండేలా వివిధ జోన్ల కింద ప్రత్యేక నిర్మాణాలు చేపడతారు. దేశంలో పారిశ్రామికంగా ఇదివరకు నిర్మించిన సిటీలు, హబ్‌లు అన్నీ 500 ఎకరాల్లోనే ఉన్నాయని, ఫ్యూచర్ సిటీ ఏకంగా 30 వేల ఎకరాల్లో రూపొందుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఒక సదస్సులో గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీని ఏఐ సిటీ, హెల్త్ సిటీ, నివాస ప్రాంతాలు, ఎడ్యుకేషన్ హబ్, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్, కూలింగ్ సిస్టమ్స్‌తో కూడిన గ్రీన్ ఫార్మా హబ్, డేటా సెంటర్లు, జీసీసీల ఏర్పాటుకు అనుగుణంగా తీర్చిదిద్దుతారు. సినిమా పరిశ్రమకు, పరిశోధనలకు కూడా అవకాశం కల్పిస్తారు. విమానాశ్రయం నుంచి మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్‌తో పాటు ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు వీలుగా రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తారు. కంపెనీలు త్వరగా కార్యకలాపాలను ప్రారంభించేందుకు వీలుగా సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తారు. ఇప్పటికే కొన్ని ఫార్చ్యూన్-500 కంపెనీలు ఇక్కడ కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. కొన్ని నిర్మాణ పనులను ప్రారంభించాయి. అమెజాన్ తమ అతి పెద్ద డేటా సెంటర్ పనులను ప్రారంభించింది. లైఫ్ సైన్సెస్ హబ్ కోసం నాగార్జున సాగర్ రోడ్డు నుంచి ప్రత్యేక రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాంతంలో పలు అంతర్జాతీయ కంపెనీల శంకుస్థాపనలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫ్యూచర్ సిటీ డెవల్‌పమెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని ఇటీవలే సీఎం ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే దేశీయ, విదేశీ కంపెనీలతో సంప్రదింపులు ఇక్కడి నుంచే నిర్వహిస్తారు. గడిచిన రెండున్నరేళ్లలో హైదరాబాద్‌కు 200కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు వచ్చాయి. దేశంలోనే అత్యంత వేగంగా జీసీసీలను ఆకర్షిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. జీసీసీల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీలో ప్రత్యేక జీసీసీ హబ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

**డిసెంబరు9,10 తేదీల్లో సమ్మిట్**

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 8, 9 తేదీల్లో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించింది. ఆ సదస్సులో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. కొన్ని కంపెనీలు కార్యకలాపాల నిర్వహణ స్థాయికి వెళ్లగా కొన్ని కంపెనీలు కార్యాలయాల భవనాలకు శంకుస్థాపనలు చేశాయి.

## మహేశ్‌గౌడ్ క్షమాపణలు చెప్పాలి

### లీగల్ నోటీసు పంపిన హరీశ్‌రావు



**హైదరాబాద్, ఆగస్టు 4:**
టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు లీగల్ నోటీసు పంపారు. క్షుద్రపూజలు చేశారంటూ తనపై చేసిన నేరపూరిత వ్యాఖ్యలకు సంబంధించి తన అడ్వకేట్ ద్వారా హరీశ్ నోటీసులు పంపారు. మీడియా, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేశారని, మహేశ్‌కుమార్‌గౌడ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే సివిల్, క్రిమినల్, పరువు నష్టం దావాలు వేస్తామని స్పష్టంచేశారు. ఆధారాల్లేని ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకుల మానసిక అసమతుల్యతకు నిదర్శనమని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిస్థితి గాల్లో దీపంలా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారమయ్యేలా చూడాలని టీవీవీపీ పరిధిలోని వైద్య ఉద్యోగులు మంగళవారం హరీశ్‌ను ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, పూర్తి స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రతి క్వింటాల్ బియ్యం రాబడతాం

**కస్టమ్ మిల్లింగ్ బకాయిలన్నీ వసూలు చేస్తాం**

**డిఫాల్టర్ మిల్లర్ల ఆస్తులు జప్తు చేసి క్రిమినల్ కేసులు పెడతాం: మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, ఆగస్టు 4**
రాష్ట్రంలో దశాబ్దకాలంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పక్కదారి పట్టిస్తూ.. ప్రభుత్వానికి బకాయిలు ఎగ్గొడుతున్న డిఫాల్ట్ మిల్లర్లను ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వారి నుంచి ప్రతి క్వింటాల్ బియ్యాన్ని, చివరి రూపాయి బకాయిని వసూలు చేసి తీరతామన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గత 10-12 సంవత్సరాలకు సంబంధించి జిల్లాలు, మిల్లుల వారీగా డిఫాల్టర్ల జాబితాలను సిద్ధం చేసి ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఇన్నాళ్లూ మిల్లర్లు సకాలంలో బియ్యం ఇవ్వకపోవడం, ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా అమ్ముకోవడం, కోర్టుల్లో కేసులు వేయడంతో ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక, పరిపాలనా సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి చెప్పారు. ప్రభుత్వ బకాయిలు చెల్లించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చర్యలను వేగవంతం చేయడమే కాకుండా వారి స్థిర, చరాస్తులను వెంటనే జప్తు చేయాలని నిర్ణయించామని తెలిపారు. తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారి బ్యాంక్ గ్యారెంటీలు, సెక్యూరిటీలను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

## రాష్ట్ర నాశనం కోసం హరీశ్ క్షుద్రపూజలు

**మార్చి2న తిరుచ్చి, జూన్ 1న శివమొగ్గ వెళ్లొచ్చాడు**

**ఆ తేదీల్లో ఎక్కడున్నారో హరీశ్‌రావు చెప్పాలి**

**అప్పుడు ఆధారాలు బయట పెడతాం**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఆగస్టు 4:**
ఎవరైనా రాష్ట్రం బాగు కోసం దేవుళ్లకు పూజ చేస్తారని, కానీ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాత్రం రాష్ట్రం నాశనం కోరుతూ క్షుద్ర పూజలు చేయించారని టీపీసీసీ అధ్యక్షుడు మహ్హ?షకుమార్‌గౌడ్ సంచలన వ్యాఖ్య లు చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా కరువు పరిస్థితులు ఏర్పడాలని కోరుతూ.. హరీశ్‌రావు మార్చి 2న తిరుచ్చి, జూన్ 1న శివమొగ్గలో క్షుద్రపూజలు చేశారని, అందుకు ఆధారాలు ఉన్నట్టు చెప్పారు. వరుస ఎన్నికల్లో ఓటమితో ప్రజ లు తమవైపు లేరని అర్థం చేసుకున్న హరీశ్‌రావు.. ఇలాంటి పూజలు చేస్తే లాభం కలుగుతుందని అనుకుని ఉంటాడన్నారు. ఎప్పుడు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే హరీశ్.. ఆ ఆలయాలకు సంబంధించిన ఫొటోలు, వివరాలను ఎందుకు పంచుకోలేదని సందేహం వ్యక్తం చేశారు. ఆ తేదీల్లో ఎక్కడ ఉన్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు తాము ఆధారాలు బయటపెడతామని చెప్పారు. హరీ శ్‌రావు తన తప్పును ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. వాస్తవాలు బయటపడడంతోనే భయపడి, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డికి లీగల్ నోటీసులు పంపారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్, ఆ పార్టీ నాయకులు అఘోరాలతో తాంత్రిక, క్షుద్ర పూజలు చేయిస్తున్నారన్న ప్రచారం ఉందని.. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చూశాక అది నిజమేనన్న అనుమా నం కలుగుతోందని పేర్కొన్నారు. ఉద్యమం సమయంలో హరీశ్ అగ్గిపెట్టె నాటకంవల్ల ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు.

## విధ్వంసం నుంచి

# వికాసం దిశగా..

## రెండేళ్లలో నవ్యాంధ్ర పరుగు..

**అభివృద్ధి, సంపద సృష్టి, సమతుల్యత, సంక్షేమం.. నాలుగు సూత్రాలతో పాలన**

**పెట్టుబడులకు 28 అనుకూల విధానాలు**

**ఉద్యోగుల బకాయిలు 30,849 కోట్లు జమ**

**ఆర్థికంపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం**

**అమరావతి, ఆగస్టు 4:**
"రాష్ట్ర విభజన తర్వాత ఎక్కువ జనాభాతో తక్కువ వనరులతో రాజధాని లేకుండా ఏపీ ఏర్పడింది. అంతేకాదు, వారసత్వ అప్పులతో వచ్చిన కష్టాల్లో ఉన్న రాష్ట్రం తొలి ఐదేళ్లలో బలంగా నిలదొక్కుకుంది. ఆ తర్వాత వైసీపీ హయాంలో ఏపీ బ్రాండ్ ఘోరంగా పతనమైంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వ హయాంలో 'బ్రాండ్'ను తిరిగి సొంతం చేసుకుని పరుగులు పెడుతోంది." అని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆర్థిక శాఖపై శ్వేతపత్రం విడుదల చేశారు. వైసీపీ ఐదేళ్లలో చేసిన విధ్వంసాన్ని దాటుకుని ఎలా ముందుకెళు న్నామనే అంశాలను ఆయన గణాంకాలతో సహా వివరించారు. 2014లో రాష్ట్ర విభజన బాధాకరం. ఆర్థిక వ్యవస్థ నిర్మాణం వ్యవసాయ ఆధారంగా మారింది. ఉమ్మడి రాష్ట్ర జనాభాలో 58 శాతం వాటా ఏపీకి వచ్చింది. వనరులు మాత్రం 46 శాతం మాత్రమే దక్కాయి. రాజధానిని కోల్పోవడం వల్ల ఆదాయం దెబ్బతింది. 2019లో ప్రభుత్వం మారడంతో విధ్వంసం



ప్రారంభమైంది. వ్యవస్థల పతనం, దుష్పరిపాలన జరిగాయి. చట్టం, శాంతి భద్రతలు దెబ్బతిన్నాయి. 'బ్రాండ్ ఏపీ' ప్రతిష్ఠ మసకబారింది. 2024 ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 'బ్రాండ్ ఏపీ' పునరుద్ధరణ, సంక్షేమ హామీల అమలు, సమానంగా ప్రాంతీయ అభివృద్ధి, రాజధాని ప్రాజెక్టులకు ఊతమిస్తున్నాం.

## ప్రభుత్వ ఆఫీస్‌లకు 'టీ-ఫైబర్'తోనే ఇంటర్‌నెట్

**వచ్చేనెల నుంచి ప్రైవేటు నెట్ ఆపరేటర్లకు బిల్లులు ఇవ్వద్దు**

**లోకల్ కేబుల్ ఆపరేటర్ల భాగస్వామ్యంతో కనెక్షన్ ఇచ్చేలా ఏర్పాట్లు: మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, ఆగస్టు 4:**
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబరు 1నుంచి కేవలం టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్‌నెట్ సేవలు అందించాలని మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. అప్పటినుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్‌నెట్ సేవల కోసం ప్రైవేటు ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టంచేశారు. మంగళవారం సచివాలయంలో 'టీ-ఫైబర్'పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, టీ-ఫైబర్ ఎండీ వేణుప్రసాద్‌లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గడిచిన ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ



కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేశామని, ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు రూ.13కోట్లు ఆదా అయిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కూడా ఈ సేవలను విస్తరించేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (టీ-స్వాన్)ను నెల రోజుల్లో పూర్తిస్థాయిలో టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీకి పూర్తిస్థాయిలో ఇంటర్‌నెట్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని 'టీ-ఫైబర్'కు సూచించారు. టీ-ఫైబర్ నెట్ వినియోగం ద్వారా ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.300-400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందదన్నారు.

# కరెంటు కోత.. దోమల మోత..

**లక్షెట్టిపేట ఆగస్టు04(మన సమాజం)** లక్షెట్టిపేట లో రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయం సందర్భం లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళ గంటల తరబడి కరెంటు కట్ చేయడంతో నరకయాతన అనుభవిస్తున్నామని చెబుతున్నారు. విద్యుత్ కోతల కారణంగా జనాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు కూడా కరెంట్ కోతలతో.. పసిపిల్లల తల్లులు విసనకర్రలతో గాలి విసురుతూ కూర్చోవాల్సి వస్తోంది. ఇది ఇలా ఉండగా అటు ధోమలతో





పరేషాన్ నెలకోసారైనా జాడలేని ఫాగింగ్ అనారోగ్యం పాలవుతున్న ప్రజలు దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి నెలలో రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేస్తే ఎంతో కొంత దోమలను నివారించే ఆస్కారం ఉంటుంది. కానీ అది ఎక్కడా అమలు కావడం లేదు. అధికారులు సంవత్సరంలో కనీసం రెండు, మూడు సార్లు కూడా ఫాగింగ్ చేయించడం లేదు. దీంతో రోజురోజుకూ దోమల బెడద ఎక్కువవుతోంది. బయటకు వస్తే దోమలతో తట్టుకోలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల వల్ల గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకుతాయని భయపడుతున్నారు. ఇప్పటికైన పట్టణంలో అధికా రులు ఫాగింగ్ నిర్వహించి దోమలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

# చరిత్రను విస్మరించిన వందేమాతరం వివాదం!

భారత స్వాతంత్ర్యోద్యమ చారిత్రక చిహ్నమైన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతం విరచితమై 150 సంవత్సరాలైన సందర్భంగా కొనసాగుతున్న వివాదం నిరర్థకమైనది. చరిత్రను విస్మరించి వ్యాఖ్యలు చేయడం సరికాదు. 1937లో జరిగిన ఎన్నికలలో భారత జాతీయ కాంగ్రెస్ విజయం సాధించి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల నేర్పాటు చేసింది. అయితే బెంగాల్‌లో ముస్లిం లీగ్ నాయకుడు ఎ.కె.ఫజ్లుల్ హక్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో చేర్చుకునే ందుకు ఫజ్లుల్ హక్ సుముఖత చూపినా అందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. కాంగ్రేసేతర ప్రభుత్వం నెలకొనడంతో బెంగాల్‌లో హిందూ%-%ముస్లిం వర్గాల మధ్య రాజకీయంగానూ, సామాజికంగానూ విభేదాలు తీవ్రమయ్యాయి. జాతిని దైవిక మాతృమూర్తిగా వ్యక్తీకరించిన వందేమాతరం గీతంలోని హిందూ ప్రతీకవాదం, దుర్గామాత ప్రస్తుతికి వ్యతిరేకంగా ముస్లిం నాయకులు ఆందోళన చేస్తున్న రోజులవి. వందేమాతరంను జాతీయగీతంగా స్వీకరించకూడదనేది ముస్లింల డిమాండ్. దేశవ్యాప్తంగా మత సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నందున ఈ వివాదంలో జోక్యం చేసుకోవడం జాతీయ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వానికి అనివార్యమయింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సంప్రదించింది. వందేమాతరం గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయగీతంగా ఆలపించవచ్చని ఆయన అన్నారు.

అయితే కాంగ్రెస్ విశ్వసించే అహింసా సిద్ధాంతం, లౌకికవాద విలువలకు వందేమాతరం గీతం పూర్తిగా విరుద్ధమైనందున **National Anthem** గా స్వీకరించేందుకు అది యోగ్యమైనది కాదని కృష్ణ కృపలానీ (రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, ఠాగూర్ స్వంత మనుమడు) అక్టోబర్ 1937 'విశ్వభారతి న్యూస్'లో రాసిన ఒక వ్యాసంలో వాదించారు. 1896లోనే వందేమాతరం గీతానికి స్వరరచన చేసిన రవీంద్రుడు తన 70వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆ గీతంపై ఆలోచనాత్మక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'వందేమాతరం' బదులుగా '%ఖుఅనవ ఎతీఖ్ఖుఖుఎ%' (వందే వ్రతనం) ను పాటించాలని అంటే మాతృభూమికి, మానవాళికి సేవ చేసే 'ప్రతిజ్ఞ'కు నిబద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వందేమాతరంలో దుర్గామాతను స్తుతించే శ్లోకాలు ఉన్నందున ముస్లింలు ఆ గీతాన్ని జాతీయగీతంగా అంగీకరించేందుకు ఒప్పుకోలేదు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో ఆ గీతం ఒక విడదీయరాని భాగంగా ఉన్నందున వందేమాతరం **National Anthem** అయ్యేందుకు అర్హమైనది అని సదాచార హిందువులు, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నవారు విశ్వసించారు. బంకించంద్ర గేయంపై తన అభిప్రాయం చెప్పాలని రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సుభాష్ చంద్రబోస్ వ్యక్తిగతంగా కోరారు. 'సాహిత్య రచన అయిన 'ఆనందమఠ్' నవలలో వందే మాతరం ఉండడం సముచితమేనని, అయితే దానిని జాతీయగీతంగా స్వీకరించడం సరికాదని రవీంద్రుడు స్పష్టం చేశారు. "వందేమాతరంలోని ప్రధానభాగం దుర్గామాతను ప్రస్తుతించే స్తోత్రాలు. ఈ విషయమై ఎటువంటి చర్చ అవసరం లేదు. బంకించంద్ర ఛటర్జీ ఆ గీతంలో మాతృభూమిని ఒక హిందూ దేవతగా ఆరాధించాడు. ఎంత దేశభక్తుడయిన ముస్లిం కూడా మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధిస్తాడని భావించలేము. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా పలు పత్రికల ప్రత్యేక సంచికలు వందేమాతరం చరణాలను ఉటంకించాయి. ఆ గీతాన్ని దుర్గామాత స్తుతిస్తోత్రంగా సదరు పత్రికల సంపాదకులు భావిస్తున్నారనేందుకు అదే నిదర్శనం. 'ఆనందమఠ్' సాహిత్య రచన గనుక అందులో వందేమాతరం గీతం ఉండడం సముచితమే అయినప్పటికీ సకల మతాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు లాంటి ప్రదేశంలో దాన్ని ఆలాపించడం సరికాదు. అందుకు సర్వజనామోదం ఉండదు' అని సుభాష్ బోస్‌కు రాసిన లేఖలో ఠాగూర్ పేర్కొన్నారు. సుభాష్ బోస్ ఈ వివాదంపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. వందే మాతరంపై ఆయన మౌనం ఆ గీతం మద్దతుదారులను నిరాశపరిచింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో కలకత్తాలో సమావేశమయింది. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఆచార్య జేబీ కృపలానీ మొదలైన వారందరూ ఆ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ సమావేశాలలో ఆలాపించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఆ గీతంపై ముస్లిం దృక్కోణాన్ని కాంగ్రెస్ అంగీకరించిదని ఆ నిర్ణయం స్పష్టం చేసింది. కాంగ్రెస్ నిర్ణయం బెంగాల్ హిందువులకు ఆశాభంగం కలిగించిందని శరత్ బోస్ (సుభాష్ అన్నయ్య) అన్నారు. మహారాష్ట్రలో సైతం కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. **National Anthem**ను ఎంపిక చేసేందుకు మౌలానా ఆజాద్, నెహ్రూ, సుభాష్, ఆచార్య నరేంద్రదేవ్‌లతో కాంగ్రెస్ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ కమిటీకి సలహాదారుడు. సుభాష్ బోస్‌కు రవీంద్రుడు రాసిన ఒక వ్యక్తిగత లేఖలో వ్యక్తం చేసిన భావాలను ఉటంకిస్తూ జాతీయగీతంపై ఆయన ఇచ్చిన సలహాపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక ప్రకటనను విడుదల చేసింది. సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని జాతీయవాద పత్రికలు విమర్శించాయి. అయితే సుభాస్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. ?కాంగ్రెస్ నుంచి వెలివేత తరువాత కూడా సుభాష్ బోస్ తన తొలి వైఖరికే నిబద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ సంస్థ అని, అన్ని మతాల వారి మనోభావాలను అది గౌరవించవలసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. 1938లో బంకించంద్ర ఛటర్జీ శత జయంత్యుత్సవాల సందర్భంగా వందేమాతరం వివాదాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ గీతం మొత్తాన్ని జాతీయ గీతంగా ప్రకటించాలనే డిమాండ్ గట్టిగా వచ్చింది. అయితే సుభాష్ బోస్ ఈ డిమాండ్‌కు మద్దతునివ్వలేదు. కాంగ్రెస్ నిర్ణయమే ప్రభావశీలంగా ఉండిపోయింది.

## చాలా ప్రాంతాల్లోని ప్రజలకు వ్యాప్తి చెందుతున్న

# స్క్రబ్ టైఫస్ పురుగు వ్యాధి..

### ఎలా గుర్తించాలి, చికిత్స ఏమిటి, ఏం జాగ్రత్తలు పాటించాలి..?



కరోనా సమయంలో ప్రజలు ఎంత విలవిలలాడిపోయారో అందరికీ తెలిసిందే. చాలా మంది ప్రాణాలను కోల్పోయారు. ఈ క్రమంలో అప్పటి నుంచి కొత్తగా ఏదైనా వ్యాధి వ్యాప్తి చెందుతుందంటే ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురై బెంబేలెత్తిపోతున్నారు. కొత్త వ్యాధులపై చాలా మందిలోనూ తీవ్రమైన భయాందోళనలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం %బాషెతీబఎ ుఎజూష్ట్రబం% (స్క్రబ్ టైఫస్) అనే మరో వ్యాధి వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని, సరైన సమయంలో అప్రమత్తంగా ఉండి చికిత్స తీసుకుంటే సరిపోతుందని, దీని వల్ల భయభ్రాంతులకు గురి కావల్సిన పనిలేదని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే అసలు ఈ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది, దీని లక్షణాలు ఎలా ఉంటాయి, ఎలాంటి చికిత్స అందిస్తారు, ఏమేం జాగ్రత్తలను పాటించాలి.. అన్న సమస్త విషయాలను వైద్యులు వెల్లడిస్తున్నారు.

**బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ వల్ల వచ్చే వ్యాధి..**

స్క్రబ్ టైఫస్ అనేది ఓ తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ వ్యాధి. పలు రకాలు పురుగులు కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. **Orientia tsutsuga mushi** అనే బ్యాక్టీరియా ఈ వ్యాధిని కలగజేస్తుంది. ఆసియా, ఆస్ట్రేలియా, పసిఫిక్ దీవులు తదితర ప్రాంతాల్లో నివసించే వారికి ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. అయితే ఈ వ్యాధి కొత్తగా వచ్చిందేమీ కాదు, ఎప్పటి నుంచో ఉన్నదే. కానీ ప్రస్తుతం పలు చోట్ల ప్రజలకు ఇది వ్యాప్తి చెందుతోంది. కొన్ని చోట్ల కొందరు బాధితులు మరణించినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. కనుకనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ వ్యాధి కరోనాలాగా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందదు. కేవలం పురుగులు కుట్టడం వల్లనే వస్తుంది. ఇక ఈ వ్యాధి వచ్చిన వారిలో పలు లక్షణాలు కనిపిస్తాయి.

**లక్షణాలు..**

స్క్రబ్ టైఫస్ వచ్చిన వారికి మొదటి వారం రోజుల వరకు దాదాపుగా ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ వారం రోజుల తరువాత నుంచి శరీరంలో పలు లక్షణాలను గమనించవచ్చు. ముఖ్యంగా తీవ్రమైన జ్వరం వస్తుంది. వణుకు కూడా ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు ఉంటాయి. పురుగులు కుట్టిన చోట చర్మంపై పెద్ద ఎత్తున దద్దుర్లు వస్తాయి. ఆ ప్రాంతం అంతా నలుపు లేదా ఎరుపు రంగులోకి మారి దురద పెడుతుంది. చర్మంపై ఇతర భాగాల్లోనూ కొందరికి దద్దుర్లు వచ్చి దురద పెడుతుంటాయి. తీవ్రమైన దగ్గు ఉంటుంది. వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలి. సాధారణంగా యాంటీ బయోటిక్స్, జ్వరం, ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలకు చెందిన మందులను డాక్టర్లు ఇస్తారు. అందువల్ల ఈ వ్యాధి వచ్చిన వారు దాదాపుగా హాస్పిటల్‌లో చేరకుండానే చికిత్స తీసుకోవచ్చు. కానీ కొందరికి హాస్పిటల్‌లో చికిత్స ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతుంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు..**

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదు అని, సాధారణ యాంటీ బయోటిక్స్, జ్వరం మందులను ఇస్తే తగ్గిపోతుందని, అందువల్ల దీని గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదని వైద్యులు చెబుతున్నారు. అయితే లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఇక ఈ వ్యాధి సోకిన వారు ద్రవాహారం అధికంగా తీసుకోవాలి. కొబ్బరినీళ్లు, వెజిటబుల్ సూప్, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలను తీసుకోవాలి. అలాగే తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. తెల్ల అన్నం, మజ్జిగ అన్నం, కిచిడీ, ఓట్ మీల్, ఉడకబెట్టిన ఆలుగడ్డలు, పెరుగు, పెసలు, అరటి పండ్లు, బొప్పాయి, క్యారెట్లు, గుమ్మడికాయలు వంటి ఆహారాలను తీసుకుంటే శరీరానికి పోషకాలు లభించి వ్యాధి నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. ఇక ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే మీ ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు నీరు లేకుండా, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఇళ్లలో పురుగులు లేకుండా చూసుకోవాలి. ఇంట్లో ఫ్లోర్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ఈ విధమైన జాగ్రత్తలను పాటిస్తే ఈ వ్యాధి బారిన పడకుండా ఉంటారు.

# క్యాల్షియంతో పాటు..

ఎముక నిర్మాణంలో క్యాల్షియం ఎంత ముఖ్యమో విటమిన్ డి అంతే అవసరం. ఇవి రెండు సరిపోయేంత ఉంటేనే ఎముకలు పటిష్టంగా ఉంటాయి. ఆహారం ద్వారా శరీరంలోకి చేరిన క్యాల్షియం ఎముకకు చేరాలంటే విటమిన్ డి కీలక పాత్ర పోషిస్తుంది. క్యాల్షియాన్ని ఎముకకు చేర్చే క్రమంలో విటమిన్ డి ఒక వాహకంలా పనిచేస్తుంది. విటమిన్ డి తగినంత లేకుంటే ఆహారం, సప్లిమెంట్స్ ద్వారా ఎంత క్యాల్షియం తీసుకున్నా వ్యర్థమవుతుంది. అందుకే క్యాల్షియంతో పాటు విటమిన్ డి కూడా శరీరానికి అందించాలి.

నిజానికి మన చర్మంలో విటమిన్ డి క్రియారహిత రూపంలో ఉంటుంది. ఎప్పుడైతే సూర్యరశ్మి తగులుతుందో అప్పుడు డి విటమిన్ యాక్టివ్ అవుతుంది. అందుకే ప్రతి రోజు ఉదయం పూట కనీసం గంట సేపు ఎండ తగిలేలా చూసుకోవాలి. మారిన జీవనశైలి కారణంగా విటమిన్ డి లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారు సప్లిమెంట్స్ రూపంలో తీసుకోవచ్చు. వైద్యుల సూచన మేరకు క్యాల్షియం, విటమిన్ డి మందులు వాడొచ్చు.



## అతిశయోక్తులు,

# అవాస్తవాలు

విశాఖపట్టణంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ నిర్మిస్తున్న ఒక గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు గురించి నవంబర్ 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గుత్తా రోహిత్ వ్యాసంలో అనేక అతిశయోక్తులు, అవాస్తవాలు ఉన్నాయి. మొదటగా గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులో అదానీ, ఎయిర్‌టెల్ కేవలం సహాయకులే (ఎనేబ్లర్లు) కానీ భాగస్వాములు కాదు. డేటా సెంటర్ స్థాపనకు అవసరమైన నిర్మాణాలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తే, సముద్ర గర్భ కేబుల్స్, అంతర్జాతీయ డేటా ట్రాన్సిట్, అంతర్జాల సదుపాయాలను ఎయిర్‌టెల్ సమకూరుస్తుంది. నిజానికి యూఎస్‌ఏలోని 50 రాష్ట్రాలలో 5,426 డేటా సెంటర్లు, చైనా, యూరోప్, సింగపూర్ తదితర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం, డేటా లోకలైజేషన్ విధానాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ%-%కామర్స్, డిజిటల్ సేవల విస్తరణ వల్ల డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరిగి డేటా సెంటర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డేటాలో భారత్ 20శాతం ఉత్పత్తి చేస్తున్నా, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం మూడు శాతం మాత్రమే. మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదని ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది. గూగుల్ అమెరికా వెలుపల ఇంత భారీ స్థాయి పెట్టుబడులతో భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ విశాఖలో ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదు. కేవలం డేటా సెంటర్ ఏర్పాటే కాకుండా సబ్ సీ కేబుల్, కేబుల్ లాండింగ్ స్టేషన్ ఏర్పాట్లపై దృష్టి పెట్టిన గూగుల్, కొత్త గ్లోబల్ సబ్ సీ కేబుల్ వ్యవస్థను విశాఖ డేటా సెంటర్‌తో అనుసంధానించడం ద్వారా విశాఖను గ్లోబల్ కనెక్టివిటీకి గేట్‌వేగా మార్చబోతోంది. ఇందువల్ల ఈ డేటా సెంటర్‌లో ప్రాసెస్ అయిన డేటా మొత్తం సబ్ సీ కేబుల్ ద్వారా నేరుగా సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియాతో సహా మరో 12 దేశాలకు లింక్ అవుతుంది. డేటా సెంటర్లలో విద్యుత్, నీటి వినియోగం అధికంగా ఉంటుందనేది నిజం. అయితే గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్ సరఫరా చేయడం వల్ల విశాఖ నగరంపై ప్రభావం పడుతుందనేది పూర్తిగా అపోహే. డేటా సెంటర్ కోసం విశాఖపట్టణం మొత్తానికి రోజుకు అవసరమైన నీటిలో 11శాతం కావాలన్న వ్యాసకర్త అభిప్రాయం సత్యదూరం.

పోలవరం నుంచి ప్రధాన ఎడమ కాలువ ద్వారా 2027 డిసెంబర్ నాటికి 24 టీఎంసీల నీరు విశాఖకు ఇవ్వాలని ప్రభుత్వ సంకల్పం. ఈ దిశలో పోలవరం పనులు వేగంగా జరుగుతుంటే, ఎడమ ప్రధాన కాలువ పనులు రెండు నెలల్లో పూర్తవుతాయి. కాబట్టి డేటా సెంటర్ నిర్మాణం పూర్తయ్యేనాటికి (2028) పోలవరం నీళ్లు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న సంప్రదాయ విధానాల్లో గూగుల్ డేటా సెంటర్ కోసం అత్యధికంగా 0.5 టీఎంసీల నీరు అవసరం అవుతుందని అంచనా. కానీ గూగుల్ ప్రస్తుతం అనుసరిస్తున్న నీటి స్ప్రేయింగ్ విధానాలు కాకుండా అత్యంత సమర్థమైన, ఆధునిక లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ వినియోగించడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా 20శాతం తగ్గుతుంది. పోలవరం నుంచి మనం ఇవ్వబోయేది, గూగుల్ వాడుకునేది అర టీఎంసీ కన్నా తక్కువ నీరు మాత్రమే. ఎక్కువ నీరు అవసరమైతే డీశాలినేషన్ విధానం ద్వారా సముద్రపు నీటిని శుద్ధి చేసి వాడుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. కాబట్టి ఏ విధంగా చూసినా నీటి లభ్యత పెద్ద సమస్య కానేకాదు. రాష్ట్రంలో 2025 ఏప్రిల్ నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యం 18,552.9 మె.వా (పునరుత్పాదక విద్యుత్ 9,419 మె.వా, థర్మల్ విద్యుత్ 7,655.50 మె.వా, జల విద్యుత్ 1,672.60 మె.వా) కాగా 2030 నాటికి 31,000 మె.వాట్లకు చేరుతాం. కాబట్టి డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా చేయడం సమస్య కాదు. అయితే గూగుల్ "మా డేటా సెంటర్ నిర్వహణకు కావలసిన విద్యుత్ అదానీ నిర్మించబోతున్న సొంత సౌరశక్తి ప్లాంట్ల ద్వారా తయారు చేసి గ్రిడ్‌కు అనుసంధానించుకుని వాడుకుంటాం, మీ విద్యుత్ అవసరం లేదు" అంటోంది. కాబట్టి రాష్ట్రానికి విద్యుత్ భారం దాదాపు ఉండదు. ఐటీ కంపెనీల కంటే తక్కువ మంది ఉద్యోగులను డేటా సెంటర్లు నియమించుకున్నప్పటికీ సాధారణంగా అధిక వేతనాలు ఇస్తాయి. వర్జీనియా రాష్ట్ర 'జాయింట్ లెజిస్లేటివ్ ఆడిట్, రివ్యూ కమిషన్ రిపోర్ట్' డేటా సెంటర్ పరిశ్రమ వర్జీనియా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వార్షికంగా సుమారు 74,000 ఉద్యోగాలు, 5.5 బిలియన్ డాలర్ల శ్రామిక ఆదాయం, 9.1 బిలియన్ డాలర్ల స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)ని అందిస్తున్నదని తెలియజేసింది. ఈ ఆర్థిక లాభాలలో చాలా భాగం డేటా సెంటర్ల నిరంతర కార్యకలాపాల కంటే ముందే నిర్మాణ దశ నుంచే వస్తాయి. కాబట్టి డేటా సెంటర్ వల్ల కేవలం వందల ఉద్యోగాలు వస్తాయనే వ్యాసకర్త భావన అసంబద్ధం. విశాఖ గూగుల్ హబ్ అత్యాధునిక ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, భారీ స్థాయి ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయపరచి విశాఖను కృత్రిమ మేధ పరివర్తన కేంద్రంగా నిలబెడుతుంది. డేటా సెంటర్లు సాధారణ కంప్యూటింగ్ నుంచి ఏఐ, మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వైపు మారడం వల్ల ఏఐ పరిశోధనలు, నిర్వహణ, అనుభవం ఉన్న టెక్ నిపుణుల అవసరం చాలా ఎక్కువ. ఏఐ ఇంజినీరింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ ఆర్కిటెక్చర్, డేటా మానిటరింగ్, జీపీయూ క్లస్టర్ నిర్వహణ, సబ్ సీ కేబుల్ లాండింగ్ స్టేషన్ కూడా ఉండటం వల్ల కేబుల్ నిర్వహణ కోసం కూడా ఉద్యోగుల అవసరం ఉంటుంది. అలాగే ఏఐ ఆధారిత స్టార్టప్స్, పరిశ్రమలకు విశాఖ కేంద్రంగా మారుతుంది. పీఐబీ నివేదిక ప్రకారం గూగుల్ డేటా సెంటర్ వల్ల రాష్ట్రానికి అన్ని పన్నులు, ఇతరత్రా కలుపుకుని ఏటా రూ.10,588 కోట్ల ఆదాయం వస్తుంది. అంటే రాష్ట్ర ప్రస్తుత ఆదాయాన్ని అనుసరించి రాష్ట్రానికి గూగుల్ 'ఒక నెల' ఆదాయాన్ని ఇవ్వబోతోంది. గూగుల్ రాకతో కృత్రిమ మేధ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పెట్టుబడులకు ముఖద్వారంగా విశాఖ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతుంది.

# పగుళ్లతో పరేషాన్!



శీతాకాలంలో వీచే చలిగాలులకు దగ్గు, జలుబు, జ్వరంతోపాటు పిల్లల్లో పెదాలు పొడిబారడం, పెద్దల్లో పాదాలకు పగుళ్లు రావడం లాంటి సమస్యలు తరచుగా కనిపిస్తాయి. కాలి మడమల్లో పగుళ్లు సాధారణమే అయినా నివారణ చర్యలు తీసుకోకపోతే సమస్య తీవ్రమవుతుంది. సహజంగానే పాదాల చర్మంలో నూనె గ్రంథులు తకువగా ఉంటాయి. శీతాకాలంలో ఈ నూనెలు మరింత తగ్గడంతో మడమల దగ్గర పగుళ్లు ఏర్పడతాయి. వయసు పెరిగే కొద్దీ చర్మం దాని స్థితిస్థాపకతను కోల్పోతుంది. సహజ నూనెల ఉత్పత్తి సైతం తగ్గుతుంది. దీనివల్ల పెద్దవాళ్లలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. మరోవైపు వాతావరణం చల్లగా ఉండటం, తగినంత నీరు తాగకపోవడం మూలంగా శరీరంలో తేమ లోపించి మడమల పగుళ్లకు దారి తీస్తుంది. మడమలు పగిలిన భాగంలో చర్మం పొకులు పొకులుగా లేచి రాత్రి పూట పడుకున్నప్పుడు బెడ్ షీట్ తగిలినా నొప్పిలేస్తుంది. మట్టిలో తిరిగే వారికి బాధ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ పగుళ్ల సమస్యతో మహిళలే ఎకువగా ఇబ్బంది పడుతుంటారు. వీటి నుంచి మీ పాదాలు రక్షించుకోవడానికి రోజూ పాదాలను గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వాతావరణంతో సంబంధం లేకుండా సరిపడా నీళ్లు తాగాలి. దీనివల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది. రోజుకు రెండుసార్లు పాదాలకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. వృద్ధులు, మధుమేహ బాధితులు రాత్రిపూట సాక్స్‌లు ధరించడం వల్ల చలిగాలి నుంచి తప్పించుకోవచ్చు. వేడి నీటితో కాకుండా గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం ఉత్తమం. ఆహారంలో ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు ఉండే విత్తనాలు, గింజలు, విటమిన్ సి కలిగిన పండ్లు తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉంటే పగుళ్లు మాయం అవుతాయి.

# తుంగతుర్తి కాంగ్రెస్‌పై జగ్గారెడ్డి నివేదిక

**ఏడు పేజీల నివేదికను పీసీసీకి సమర్పణ**

**వర్గపోరుపై క్షేత్రస్థాయిలో పది రోజుల పరిశీలన**

**ఎమ్మెల్యేనే నియోజకవర్గానికి తొలి నాయకుడని వ్యాఖ్య**

**ఉమ్మడి నల్లగొండ నేతల పాత్రపై ప్రస్తావన**



**హైదరాబాద్, ఆగస్టు 4**
సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేసి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. మొత్తం ఏడు పేజీలతో రూపొందించిన ఈ నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించినట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై గత పది రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితులను నివేదికలో పొందుపరిచినట్లు చెప్పారు. నివేదిక రూపొందించే క్రమంలో వర్గ విభేదాలకు దారితీసిన కారణాలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలు కూడా నివేదికలో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఏ నియోజకవర్గంలోనైనా స్థానిక ఎమ్మెల్యేనే తొలి నాయకుడని, ఆ తర్వాతే ఎంపీ, మంత్రులకు ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి పాత్ర ఉంటుందని పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల జరిగిన పరిణామాలను కూడా నివేదికలో ప్రస్తావించినట్లు తెలిపారు. పార్టీలో సమన్వయం, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక నాయకులుగా ఉన్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తగిన నిర్ణయాలు తీసుకుని విభేదాలను పరిష్కరించి సంస్థను మరింత బలోపేతం చేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## గగనతలంలో ఎయిరిండియా
# విమానానికి కుదుపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4**
థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానం గగనతలంలో తీవ్ర కుదుపులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు విమాన సిబ్బందితో పాటు మొత్తం 12 మందికి స్వల్ప గాయాలు కాగా, విమానానికి కూడా స్వల్ప నష్టం వాటిల్లినట్లు సమాచారం. మంగళవారం 134 మంది ప్రయాణికులతో ఫుకెట్ నుంచి బయలుదేరిన ఏఐ--379 విమానం ప్రయాణ మధ్యలో వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పుల కారణంగా తీవ్ర టర్బులెన్స్‌కు గురైంది. ఒక్కసారిగా విమానం ఎత్తు తగ్గడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఈ ఘటనను ఎయిరిండియా సంస్థ అధికారికంగా ధ్రువీకరించింది. విమానం ఒక్కసారిగా కుదుపులకు గురికావడంతో కొందరు ప్రయాణికులు సీట్ల నుంచి పైకి ఎగిరి విమానం పైకప్పును ఢీకొట్టారు. సీటు బెల్టు ధరించని కొందరికి గాయాలైనట్లు అధికారులు తెలిపారు. ఒక ప్రయాణికుడు మాట్లాడుతూ, విమానం ఒక్కసారిగా కిందకు పడిపోతున్నట్లుగా అనిపించిందని, తన తల పైకప్పుకు బలంగా తగిలిందని వివరించారు. టర్బులెన్స్ సమయంలో విమాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. పైలట్లు అత్యంత అప్రమత్తంగా విమానాన్ని నియంత్రించడంతో మరింత పెద్ద ప్రమాదం తప్పినట్లు సమాచారం. ఈ ఘటనలో గాయపడిన వారిలో ఇద్దరు విమాన సిబ్బంది కూడా ఉన్నారు. అనంతరం విమానం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. గాయపడిన ప్రయాణికులు, సిబ్బందిని వెంటనే విమానాశ్రయంలోని వైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని, అందరూ స్వల్ప గాయాలతోనే బయటపడినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు ఎయిరిండియా వెల్లడించింది.

# కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించిన ఎన్సీపీ కార్యకర్తలు

**'గూంగీ గుడియా' వ్యాఖ్యలపై ఉద్రిక్తత**

**సునేత్రా పవార్‌పై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**కార్యాలయంపై దాడిగా కాంగ్రెస్ ఆరోపణ**

**'గూండాగిరి'గా నిరసనను ఖండించిన కాంగ్రెస్ నేతలు**

**ముంబై, ఆగస్టు 4**



మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ జాతీయ అధ్యక్షురాలు సునేత్రా పవార్‌పై కాంగ్రెస్ నేతలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న "గూంగీ గుడియా" వ్యాఖ్యలపై రాజకీయ వివాదం చెలరేగింది. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఎన్సీపీ కార్యకర్తలు మహారాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. సునేత్రా పవార్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎన్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడినట్లుగా ఎన్సీపీ కార్యకర్తల చర్యలు ఉన్నాయని ఆరోపించింది. రాజకీయ భేదాభిప్రాయాలను హింసాత్మక నిరసనల ద్వారా వ్యక్తం చేయడం సరికాదని పేర్కొంది. కాంగ్రెస్ నేత సచిన్ సావంత్ స్పందిస్తూ, ఎన్సీపీ కార్యకర్తల నిరసనను "గూండాగిరి"గా అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు స్థానం లేదని వ్యాఖ్యానించారు. ఈ ఘటనతో మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది.

# రాజకీయాలపై ఏవీ రంగనాథ్ స్పష్టత

**జనసేనలో చేరతానన్న ప్రచారాన్ని ఖండించిన హైడ్రా కమిషనర్**

**పవన్ కల్యాణ్ భూమి వివాదంపై సాంకేతిక వివరణ**

**ఉద్యోగం ప్రశాంతంగా చేసుకోనివ్వాలని విజ్ఞప్తి**

**హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మరోసారి చర్చకు వచ్చిన రంగనాథ్**



**హైదరాబాద్, ఆగస్టు 4:**
తాను రాజకీయాల్లోకి వస్తున్నానంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఖండించారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. జనసేన పార్టీలో చేరతానని, ఎన్నికల్లో పోటీ చేస్తానని వస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొంటూ, తన ఉద్యోగాన్ని ప్రశాంతంగా చేసుకోనివ్వాలని కోరారు. మెగాస్టార్ చిరంజీవి కుటుంబంతో గత రెండు దశాబ్దాలుగా పరిచయం ఉందని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సాన్నిహిత్యం ఉందని రంగనాథ్ చెప్పారు. అయితే వ్యక్తిగత పరిచయాలను రాజకీయాలతో ముడిపెట్టి తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. తాను జనసేనలో చేరతానని, తెలంగాణలో పార్టీ బాధ్యతలు చేపడతానని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. గండిపేట సమీపంలోని జన్వాడలో పవన్ కల్యాణ్‌కు చెందిన భూమిపై నెలకొన్న వివాదంపై కూడా రంగనాథ్ వివరణ ఇచ్చారు. 2014లో నలుగురు రైతుల నుంచి సుమారు పది ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశారని, అనంతరం చెరువుకు సంబంధించిన ప్రాథమిక, తుది నోటిఫికేషన్లు వెలువడ్డాయని తెలిపారు. ఈ భూమి సహజ స్వరూపంలో ఎలాంటి మార్పులు చేయలేదని, చెరువును పూడ్చడం లేదా నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించే నిర్మాణాలు జరగలేదని వివరించారు. అయితే చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని రంగనాథ్ తెలిపారు. అందుకే ఆ ఫెన్సింగ్ తొలగించాలని సూచించినట్లు చెప్పారు. చెరువుల పరిధిలో ఉన్న పట్టా భూములను కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టబద్ధమేనని, అయితే సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని కేసుల్లో ఒకే విధమైన ప్రమాణాలతోనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, హైడ్రా చేపట్టిన కూల్చివేతల వ్యవహారంలో కోర్టు ధిక్కరణ ఆరోపణలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారనే ఆరోపణల నేపథ్యంలో హైడ్రా కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో తనపై వస్తున్న రాజకీయ ప్రచారాన్ని ఖండిస్తూ ఏవీ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన తనకు లేదని, ప్రజా సేవలో భాగంగా అధికారిగా తన బాధ్యతలను కొనసాగించడమే తన లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.


# పాకిస్థాన్‌లో భారీ కుంభకోణం కలకలం

**దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అన్న నఖ్వీ**

**న్యాయమూర్తులు, రాజకీయ నేతలపై సంచలన ఆరోపణలు**

**మంత్రి వ్యాఖ్యలతో అధికార వర్గాల్లో విభేదాలు**


**రాజీనామా చేయాలని ప్రతిపక్షాల డిమాండ్**



**ఇస్లామాబాద్, ఆగస్టు 4**
పాకిస్థాన్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేగింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను వెలుగులోకి తెచ్చినట్లు ఆ దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యారని, గత 21 ఏళ్లుగా భారీ స్థాయిలో లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. విలేకరులతో మాట్లాడిన మొహ్సిన్ నఖ్వీ, ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పేర్లను మాత్రం వెల్లడించలేదు. కొద్ది రోజుల క్రితం కూడా పాకిస్థాన్ పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆయన వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న మొహ్సిన్ నఖ్వీ, సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఆయన చేసిన ఆరోపణల్లో పౌర సంస్థలపైనే విమర్శలు ఉండగా, సైన్యం ప్రస్తావన లేకపోవడం రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షించింది. సైన్యం--పౌర ప్రభుత్వాల మధ్య పెరుగుతున్న విభేదాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నఖ్వీ వ్యాఖ్యలపై ప్రభుత్వంలోనే విభేదాలు వ్యక్తమయ్యాయి. రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగానే స్పందిస్తూ, నఖ్వీ ముందుగా తన సొంత శాఖలో, అలాగే పాకిస్థాన్ క్రికెట్ బోర్డులో సంస్కరణలు చేపట్టాలని సూచించారు. కేబినెట్, పార్లమెంట్ సమావేశాలకు కూడా ఆయన సక్రమంగా హాజరు కావడం లేదని విమర్శించారు. మరోవైపు పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నఖ్వీ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అధికార కూటమిలోనే విభేదాలు బయటపడటం పాక్ రాజకీయాల్లో కొత్త పరిణామంగా మారింది. ఇరాన్‌తో దౌత్య చర్చల్లో ప్రత్యేక ప్రతినిధిగా మొహ్సిన్ నఖ్వీ వ్యవహరిస్తుండటం, సైనిక నాయకత్వంతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన వ్యాఖ్యలు నిజంగా భారీ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నమా, లేక అధికార వర్గాల్లో అంతర్గత శక్తిపోరులో భాగమా అన్న దానిపై పాకిస్థాన్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

# మరో రెండ్రోజుల్లో అమెరికా-ఇరాన్ ఒప్పందం..

**హోర్ముజ్ జలసంధి తెరుచుకునే అవకాశం..**



ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి పూర్తిగా తెరుచుకునే దిశగా అమెరికా-ఇరాన్ మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్‌తో ఒప్పందం ఈరోజు లేదా రేపు కుదిరే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ వెల్లడించారు. ఈ ఒప్పందం కుదిరితే హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు 'మేము ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాము. హోర్ముజ్ జలసంధిని తెరిచి మరింత సాధారణ స్థితికి చేరుకోవడానికి ఈ రోజు లేదా రేపు ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని నేను భావిస్తున్నాను. ఈ ఒప్పందం వ్యూహాత్మక జలమార్గం గుండా స్వేచ్ఛా రాకపోకలకు తిరిగి అవకాశం కల్పిస్తుంది' అని ఆయన అమెరికా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. బెసెంట్ వ్యాఖ్యలతో అంతర్జాతీయ చమురు మార్కెట్లలో వెంటనే స్పందన కనిపించింది హోర్ముజ్ మార్గం తిరిగి తెరుచుకుంటుందనే ఆశలతో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే ఇరాన్ మాత్రం అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరుగుతున్నాయన్న వార్తలను ఖండించింది. తాము ఒమాన్‌తో సముద్ర మార్గాలకు సంబంధించిన అంశాలపైనే చర్చిస్తున్నామని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# మీకు ప్రామిస్ చేస్తున్నా!..

బాలీవుడ్ ఇండస్ట్రీలో ఫైర్‌బ్రాండ్‌గా పేరు తెచ్చుకుంది అగ్ర కథానాయిక కంగనా రనౌత్. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన మనసులోని భావాల్ని వ్యక్తం చేయడం ఈ భామ నైజం. దాంతో ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేస్తుంటుంది. తాజాగా ఆమె వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అందులో కంగనారనౌత్ మెడలో మంగళసూత్రం, చేతులకు గాజులు ధరించి వివాహితలా కనిపిస్తున్నది. దీంతో ఆమె సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందనే వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా వీటిపై ఆమె క్లారిటీనిచ్చింది. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'నేను షూటింగ్‌లో క్యారెక్టర్ మేకప్‌తో ఉండగా ఎవరో ఈ ఫొటో తీశారు. గత కొన్ని రోజులుగా నా పెళ్లి గురించి ఆరాతీస్తూ ఫోన్ కాల్స్ వస్తున్నాయి. నటులు అన్ని రకాల పాత్రలు చేయాల్సి ఉంటుంది. గెటప్‌ని చూసి పెళ్లయిపోయిందని అనుకుంటున్నారు. నేను మీ అందరికి ప్రామిస్ చేస్తున్నా. ఎట్టిపరిస్థితుల్లో రహస్యంగా పెళ్లి చేసుకోను. మీ అందరికి చెప్పే పెళ్లి చేసుకుంటా' అని కంగనా రనౌత్ తన పోస్ట్‌లో పేర్కొన్నది. ప్రస్తుతం ఈ భామ 'క్వీన్-2' షూటింగ్‌లో ఉంది. ఈ సినిమాలోని పాత్రకోసమే వివాహిత గెటప్‌లో కనిపించిందని సమాచారం.






# పెళ్లి అయ్యిందని చెప్పడంతో చేజారిన సినిమా ఛాన్స్..

### షాకింగ్ విషయాలు బయటపెట్టిన స్రవంతి

గ్లామర్ ఇండస్ట్రీలో పెళ్లి, రిలేషన్‌షిప్‌లు నటీమణుల కెరీర్‌పై ప్రభావం చూపుతాయనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా హీరోయిన్లు, యాంకర్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించాలనుకునే మహిళలకు వ్యక్తిగత జీవితం కూడా కొన్ని సందర్భాల్లో కెరీర్‌పై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వినిపిస్తుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ తెలుగు యాంకర్, బిగ్ బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న స్రవంతి తన కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదురైన ఒక సంఘటనను పంచుకుంది. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఓ పెద్ద ప్రాజెక్ట్ కోసం ఆడిషన్స్ ఇచ్చానని, నటన, లుక్స్ పరంగా తాను ఎంపికయ్యాననే సంకేతాలు కూడా వచ్చాయని తెలిపింది. మేకర్స్ తనను ఆ పాత్రకు సరైన ఎంపికగా భావించారని చెప్పింది. అయితే ఫైనల్ చర్చల సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి ప్రశ్నలు వచ్చాయని, తనకు పెళ్లైందా అని అడిగారని వెల్లడించింది. దానికి తాను ఎలాంటి సంకోచం లేకుండా "అవును, నాకు పెళ్లైంది" అని నిజాయితీగా సమాధానం చెప్పానని తెలిపింది. కానీ ఆ విషయం చెప్పిన వెంటనే పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్రవంతి పేర్కొంది. షూటింగ్ కోసం చెన్నై రావాలని, అక్కడ అడ్వాన్స్ తీసుకోవాలని ముందుగా చెప్పినట్లు గుర్తు చేసుకుంది. అయితే పెళ్లి విషయం తెలిసిన తర్వాత కొద్దిసేపట్లో కాల్ చేస్తామని చెప్పిన వారు తిరిగి స్పందించలేదని తెలిపింది. ఆ తర్వాత ఆ సినిమా అవకాశం తనకు రాలేదని, తర్వాత ఆ ప్రాజెక్ట్ కూడా ఆగిపోయిందని తెలిసిందని చెప్పుకొచ్చింది. స్రవంతి చొక్కారపు చిన్న యూట్యూబ్ ఛానెళ్లలో యాంకర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. అనంతరం ప్రముఖ హీరోల ఇంటర్వ్యూలతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా ఒక స్టార్ హీరో సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూతో ఆమెకు భారీ పాపులారిటీ వచ్చింది. తర్వాత తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ నాన్-స్టాప్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం సినిమా ఆడియో లాంచ్‌లు, సెలబ్రిటీ ఇంటర్వ్యూలు, ప్రత్యేక కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ బిజీగా ఉంది. ఇటీవల నటిగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించిన స్రవంతి, సోషల్ మీడియాలో కూడా తన గ్లామరస్ ఫోటోషూట్లతో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటోంది.

# మూడు సినిమాల నుంచి ఒక్కసారిగా తప్పించారు

### అర్ధరాత్రి ఏడ్చేశా: అనసూయ భావోద్వేగ వ్యాఖ్యలు



టెలివిజన్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ నటిగా కొనసాగుతున్నారు. యాంకర్‌గా వచ్చిన గుర్తింపును నటిగా విజయవంతంగా మలుచుకున్న అనసూయ, ఇప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న ఒక బాధాకర సంఘటనను తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కెరీర్ ప్రారంభంలో క్షణం, సోగ్గాడే చిన్ని నాయన వంటి చిత్రాల్లో అవకాశాలు రావడంతో నటిగా మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అయితే ఆమె కెరీర్‌లో నిజమైన మలుపు మాత్రం రంగస్థలం సినిమా ద్వారా వచ్చిందని చెప్పాలి. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'రంగమ్మత్త' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సినిమా ఘన విజయం సాధించడంతో అనసూయకు నటిగా డిమాండ్ మరింత పెరిగింది. అయితే విజయాలతో పాటు వివాదాలు, సోషల్ మీడియా ట్రోలింగ్ కూడా తన జీవితంలో భాగమయ్యాయని అనసూయ తెలిపారు. తనపై జరిగే విమర్శలకు, ట్రోల్స్‌కు అవసరమైనప్పుడు గట్టిగానే సమాధానం ఇస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో జరిగిన ఒక బాధాకరమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు. "ఒక సమయంలో మూడు క్రేజీ సినిమాల కోసం నన్ను ముందుగా ఎంపిక చేశారు. కానీ తర్వాత ఎలాంటి కారణం చెప్పకుండా ఆ ప్రాజెక్టుల నుంచి నన్ను తొలగించారు. ఎందుకు తీసేశారు? ఏం జరిగింది? అన్న విషయంపై కనీస వివరణ కూడా ఇవ్వలేదు" అని అన్నారు.ఆ సంఘటన తనను తీవ్రంగా బాధించిందని అనసూయ వెల్లడించారు. "ఆ రోజు రాత్రి చాలా బాధేసింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో భర్త దగ్గర కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చేశాను. ఆ బాధను జీర్ణించుకోలేకపోయాను" అని చెప్పారు. అలాగే తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలపై కూడా సోషల్ మీడియాలో అనవసర చర్చలు జరిగాయని ఆమె తెలిపారు. నేను అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాను. కానీ పరిమితంగానే తీసుకుంటాను. ఆ విషయాన్ని కూడా కొందరు వివాదంగా మార్చి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు అని పేర్కొన్నారు. అయితే ట్రోలింగ్ గురించి పెద్దగా పట్టించుకోనని, కాలక్రమంలో అలాంటి విషయాలను ఎదుర్కోవడం నేర్చుకున్నానని అనసూయ స్పష్టం చేశారు. "ఎవరు ఏమనుకున్నా, ఎన్ని ట్రోల్స్ చేసినా చివరికి నేను నా పనిని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను" అని ధైర్యంగా చెప్పారు.